క్లుప్తంగా

ముగిసిన ఎన్‌ఎస్‌ఎస్ క్యాంపు

కడప ఎడ్యుకేషన్: కడప నగర శివార్లలోని సింగపూర్ టౌన్‌షిప్‌లో వారం రోజులుగా కడప ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ స్పెషల్ క్యాంపు బుధవారంతో ముగిసింది. కాగా కళాశాలలో ఎన్‌ఎస్‌ఎస్ ముగింపు క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ నూర్జహాన్ క్యాంపులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ హబీబుల్లా, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ చెప్పలి రాజారావు, సింగపూర్ టౌన్‌షిప్ ప్రెసిడెంట్ బండి రాఘవరెడ్డి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

18 నుంచి శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్, సరీ్వసింగ్, సీసీ టీవీ కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లో గ్రామీణ ప్రాంత యువకులకు ఈనెల 18వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. ఆసక్తిగల నిరుద్యోగ యువత ఆయా కోర్సుల్లో శిక్షణ పొందేందుకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలని, దూర ప్రాంతాల వారికి వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామని ఆయన తెలిపారు.

మున్సిపల్ కార్మికుల నిరసన

కడప కార్పొరేషన్: తమ డిమాండ్లు పరిష్కరించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో చేస్తున్న సమ్మె 9వ రోజుకు చేరుకుంది. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట కార్మికులు పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సుంకర రవి, పి. జయసింహ, డి. నరసింహులు, సీఐటీయూ నగర కార్యదర్శి ఇ. ప్రకాష్, నగర వర్కింగ్ ప్రెసిడెంట్ కె. శ్రీరామ్, కె. తిరుపాల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం



డా. లక్ష్మీప్రసాద్, అసోసియేట్ డైరెక్టర్లకు నియామకపత్రాన్ని అందజేస్తున్న రిజిస్ట్రార్

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ప్రవేశాల సంచాలకులుగా ఎర్త్‌సైన్స్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి. లక్ష్మీప్రసాద్ నియమితులయ్యారు. వీసీ ఆచార్య చింతా సుధాకర్ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య నియామక పత్రాన్ని ఆయనకు అందజేశారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో పనిచేసిన ఆచార్య కె. గంగయ్య పదవీకాలం పూర్తికావడంతో నూతన నియామకం చేపట్టారు. ఈయనతో పాటు అసోసియేట్ డైరెక్టర్లుగా డా. పి. వసుగోవర్ధన్‌రెడ్డి (కెమిస్ట్రీ), డా. ఎ. మునికుమారి (జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్), డా. బి. రెడ్డయ్య (కంప్యూటర్ సైన్స్), డా. ఎన్. గణేష్‌నాయక్ (ఎకనామిక్స్)లను నియమించారు.

ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

కడప కార్పొరేషన్: మున్సిపల్ ఔట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మిక సంఘాల రాష్ట్ర జేఏసీ పిలుపు మేరకు కార్మికులు విధులు బహిష్కరించి సమ్మె బాట పట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నగర అధ్యక్ష, కార్యదర్శులు నరసింహులు, తారక రామారావులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కె. జాన్, చంద్ర, వెంకటాద్రి, రాజశేఖర్, రాజేష్, నరసింహులు పాల్గొన్నారు.

వేతన సవరణ చేపట్టాలి



నిరసన ప్రదర్శనలో ఎల్‌ఐసీ ఉద్యోగ సంఘాల ప్రతినిధులు

కడప కల్చరల్ : ఎల్‌ఐసీ యాజమాన్యం సంస్థలో వేతన సవరణను తక్షణమే చేపట్టాలని ఉద్యోగ సంఘాల జాయింట్ ఫ్రంట్ నాయకులు జె.చంద్రపాల్, అవధానం శ్రీనివాస్, శైలజ డిమాండ్ చేశారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి అలవలపాటి రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన నిరసన ప్రదర్శనను ఉద్దేశించి వారు మాట్లాడుతూ డిసెంబర్ నెలలో చర్చలని ఉద్యోగ సంఘాలను ఆహ్వానించి, వాటిని అర్థాంతరంగా వాయిదా వేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో వేతన సవరణ చర్చలు కొలిక్కి వచ్చాయని, ఎల్‌ఐసీలో వేతన సవరణ గడువు ముగిసి 18 నెలలైనా, ఇంకా చర్చలే ప్రారంభం కాకపోవడం అన్యాయమన్నారు. అన్ని కేడర్లలో ఎల్‌ఐసీలో అవసరమైనమేర నూతన నియామకాలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ల నాయకులు సుధీకర్, ఎల్లారెడ్డి, అక్బర్ బాషా, సరళ, వారిజాతమ్మ, అయ్యవారు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే



కడప రూరల్: సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఐక్యత చాటుతున్న బీసీ నేతలు

కడప రూరల్: సావిత్రిబాయి పూలే మహిళామణులకు ఆదర్శనీయమని వక్తలు అన్నారు. బుధవారం జిల్లా బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సావిత్రిబాయి జయంతి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మహిళా అధ్యక్షురాలు వల్లూరు నారాయణమ్మ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలిగా కీర్తి గడించారన్నారు. ఆమె బాలికా విద్యకు పెద్దపీట వేశారని తెలిపారు. ఆ సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు మాట్లాడారు. కార్యక్రమంలో డాక్టర్ నీలవేణి, ఉపాధ్యాయురాలు మల్లీశ్వరి, లక్ష్మీదేవి, సంఘం జిల్లా అధ్యక్షులు బత్తల లింగమూర్తి, కల్యాణ్, సుధాకర్, గుర్రప్ప తదితరులు పాల్గొన్నారు.

వైవీయూ : భారతదేశ చరిత్రలో మొట్టమొదటిసారిగా బాలికల విద్యకోసం పాఠశాలలు ఏర్పాటు చేసి సామాజిక మార్పునకు బీజం వేసిన గొప్ప సంఘసంస్కర్త సావిత్రీబాయిపూలే అని వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం వైవీయూలో ఓబీసీ సెల్ ఆధ్వర్యంలో సావిత్రీబాయి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రీబాయి పూలే చిత్రపటానికి రిజిస్ట్రార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలోని ఏదో ఒక కూడలిలో పూలే దంపతుల విగ్రహాలను ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, ఓబీసీ సెల్ డైరెక్టర్ డా. కె.ఎస్.వి. కృష్ణారావు, ఆచార్య కె.గంగయ్య, ఆచార్య ఏజీ దాములు సావిత్రీబాయి సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో పాలకమండలి సభ్యురాలు ఆచార్య చంద్రమతీశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

– కడప నగరంలోని ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో సావిత్రీబాయి పూలే జయంతి పురస్కరించుకుని మహిళా ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా సావిత్రీబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

ప్రభుత్వ కళాశాల అధ్యాపకుల సంఘం (జీసీటీఏ) ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను కళాశాల ప్రిన్సిపాల్ డా. వి. సలీంబాషా ఆవిష్కరించారు. జీసీటీఏ మహిళా కార్యదర్శి జి. విజయలక్ష్మి, నాయకులు పాల్గొన్నారు.

ఏఎఫ్‌యూలో ..

కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో సావిత్రీబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. సావిత్రీబాయిపూలే చిత్రపటానికి వైస్ చాన్సలర్ ఆచార్య బానోతు ఆంజనేయప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్ పవన్‌కుమార్‌రెడ్డి, నేషనల్ ఈవెంట్ కోఆర్డినేటర్ మనోహర్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

కడప కల్చరల్ : సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా కడప నగరంలోని గాంధీనగర్ హైస్కూలులో బుధవారం పలువురు మహిళా ఉపాధ్యాయులను జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సత్కరించారు. సంస్థ నాయకులు సునీత రూత్ ఆరోగ్య మేరీ ఈ సందర్భంగా మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే జయంతిని దేశ మహిళా ఉపాధ్యాయుల దినోత్సవంగా జరుపుకోవడం ఆమె గొప్పతనాన్ని తెలుపుతోందన్నారు. అనంతరం సంస్థ పక్షాన కొందరు మహిళా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు.

కడప ఎడ్యుకేషన్: మహిళా చైతన్య దీప్తి సావిత్రిబాయి పూలే అని యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ రూతు ఆరోగ్యమేరీ, జిల్లా సహాధ్యక్షురాలు సుజాతరాణి పేర్కొన్నారు. బుధవారం కడప మున్సిపల్ హైస్కూల్ మెయిన్‌లో జేవీవీ, యూటీఎఫ్ సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా పూలే జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జేవీవీ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సావిత్రిబాయి పూలే జీవితం ఆదర్శనీయం

కడప సెవెన్‌రోడ్స్ : చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జీవితం నేటి మహిళలకు ఆదర్శనీయమని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సునీల్‌కుమార్, అంగన్వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి, డీవైఎఫ్ఐ నగర కార్యదర్శి డీఎం ఓబులేశు అన్నారు. బుధవారం కలెక్టరేట్ వద్ద సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు అంజనమ్మ, లక్ష్మి, యశోద తదితరులు పాల్గొన్నారు.

కడప కార్పొరేషన్: సావిత్రీబాయి పూలే మహిళలకు ఆదర్శమని బీసీ సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలు వి. నారాయణమ్మ అన్నారు. బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా పాతరిమ్స్‌లోని బీసీ భవన్ వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో డా. నీలవేణి, ఉపాధ్యాయురాళ్లు మల్లీశ్వరి, లక్ష్మీదేవిలను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు బి. లింగమూర్తి, వర్కింగ్ ప్రెసిడెంట్ గోవిందు నాగరాజు, సీనియర్ బీసీ నాయకులు పాల్గొన్నారు.

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి, మహిళా లోకానికి సావిత్రిబాయి పూలే ఆదర్శమని పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి శ్రీనాథ్‌యాదవ్ అన్నారు. బుధవారం కడప చెమ్మియాపేట ప్రభుత్వ బాలికల హైస్కూల్లో సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఆమె చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్‌ఎం మేరీ, పీడీఎస్‌యూ నగర అధ్యక్షుడు గణేష్, ఉపాధ్యాయులు సువార్తమ్మ, సోఫియా, పద్మావతి, శివమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ఎస్‌వైఎఫ్ ఆధ్వర్యంలో ..

కడపలోని ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్‌వైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొన్నెలూరు శంకర్, ఆర్ఎస్‌వైఎఫ్ జిల్లా కార్యదర్శి నాగేంద్రబాబు, జిల్లా నాయకులు శివప్రసాద్, శ్రీనాథ్, నగర నాయకులు దుర్గా ప్రసాద్, సుధీర్, విష్ణువర్ధన్‌రెడ్డి, మహమ్మద్ రసూల్, పీరుల్లా తదితరులు పాల్గొన్నారు.



ఏఎఫ్‌యూ: సావిత్రీబాయి పూలే జయంతిలో వీసీ, అధ్యాపకులు



కడప సెవెన్‌రోడ్స్ : సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు



వైవీయూ : సావిత్రీబాయి పూలే జయంతి కార్యక్రమంలో రిజిస్ట్రార్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు



కడప ఎడ్యుకేషన్: సావిత్రిబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న ఉపాధ్యాయులు



కడప కల్చరల్ : ఉపాధ్యాయురాలిని సత్కరిస్తున్న జేవీవీ ప్రతినిధులు

పవిత్ర ఉమ్రా యాత్రకు డిప్యూటీ సీఎం అంజద్‌బాష



ఉమ్రా యాత్రకు వెళుతున్న ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష

కడప కల్చరల్ : రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఎస్‌బీ అంజద్‌బాష పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరి వెళ్లారు. కడపకు చెందిన మదీనా హజ్ టూర్స్ అధినేత సయ్యద్ హబీబుల్లా బుఖారి ఆధ్వర్యంలో యాత్రకు బయలుదేరారు. ఈ సందర్భంగా సయ్యద్ హబీబుల్లా బుఖారి మాట్లాడుతూ పవిత్రమైన ఉమ్రా యాత్రలో ప్రపంచ శాంతి కోసం, ప్రజలు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు.

వెంకటయ్య పేరిట 'సవేరా' నాటక అవార్డు



పల్లేటి లక్ష్మీ కులశేఖర్‌కు బహుమతి అందజేస్తున్న ఖాసింఖాన్ తదితరులు

కడప కల్చరల్ : సవేరా నాటక సంస్థను స్థాపించి నంది అవార్డుల పంట పండించి నాటక కళలో జిల్లాకు గొప్ప ప్రతిష్ఠను సాధించి పెట్టిన ఆళ్లూరి వెంకటయ్య పేరిట నాటక అవార్డును ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ గౌరవాధ్యక్షులు, ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి తెలిపారు. బుధవారం సీనియర్ ఆడిటర్ లయన్ ఖాసింఖాన్ కార్యాలయంలో నంది అవార్డు విజేతలైన ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, పల్లేటి లక్ష్మీకులశేఖర్‌లను ఘనంగా సత్కరించారు. చిన్నపరెడ్డి, లయన్ ఖాసింఖాన్ మాట్లాడుతూ సవేరా సంస్థకు కొత్త ఉత్సాహం కల్పించేందుకు కొత్త కమిటీ ఏర్పాటుతో సంస్థను నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా పల్లేటి లక్ష్మీకులశేఖర్‌కు ఖాసింఖాన్ రూ. 5116 బహుమతిగా అందజేశారు. ఆచార్య మూల , సంఘ సేవకులు సలావుద్దీన్, లయన్ షరీఫ్‌ఖాన్‌లు కూడా సవేరా సంస్థ అభివృద్ధికి సహకారాన్ని అందజేస్తామన్నారు. రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు, సవేరా సంస్థ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, సుబ్బరాయుడు, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

అంధుల ఆరాధ్యదైవం లూయి బ్రెయిలీ

– నగర మేయర్ సురేష్‌బాబు

కడప ఎడ్యుకేషన్: అంధుల ఆరాధ్యదైవం లూయి బ్రెయిలీ అని కడప నగర మేయర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. లూయి బ్రెయిలీ జయంతిని పురస్కరించుకుని కడప శంకరాపురం అంధుల పాఠశాలలో రాష్ట్ర రాయల్ అంధుల సంఘం అధ్యక్షుడు వెంకటరెడ్డి అధ్యక్షతన రెండు రోజుల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మొదటి రోజు బుధవారం జిల్లావ్యాప్తంగా వివిధశాఖల్లో పనిచేస్తున్న అంధ ఉద్యోగులకు ఆటల పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నగర మేయర్ సురేష్‌బాబు మాట్లాడుతూ కృషి, పట్టుదల ఉంటే మనిషి ఎదుగుదలకు అంధత్వం అడ్డురాదన్నారు. ప్రతి ఒక్కరూ లూయి బ్రెయిలీని ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు. అనంతరం మేయర్‌తోపాటు డిప్యూటీ ఈఓ రాజగోపాల్‌రెడ్డి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్, అంధుల పాఠశాల హెచ్‌ఎం శంకరయ్యలు ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రాయల్ అంధుల సంఘం ప్రధాన కార్యదర్శి ప్రకాష్‌రెడ్డి, ట్రెజరర్ రాజ తదితరులు పాల్గొన్నారు.



క్రీడలను ప్రారంభిస్తున్న మేయర్ సురేష్‌బాబు తదితరులు

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని కేఎంసీ కమిషనర్ ఎస్ ఎస్ ప్రవీణ్‌చంద్ ఆదేశించారు. బుధవారం అంబేడ్కర్ సర్కిల్–వై జంక్షన్, అన్నమయ్య జంక్షన్, మాసాపేట సర్కిల్, దేవుని కడప రోడ్డు, క్రిష్టా సర్కిల్ వద్ద జరుగుతున్న పనులను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. అంబేద్కర్ సర్కిల్ వద్ద హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలని, అన్నమయ్య జంక్షన్ వద్ద పనులను త్వరగా పూర్తి చేసి ఆ రోడ్డు ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిందిగా ఆర్ అండ్ బి శాఖ అధికారులను ఆదేశించారు. మాసాపేట జంక్షన్‌లో స్టోన్ వర్క్ వెంటనే పూర్తి చేయాలన్నారు. దేవుని కడప రోడ్డు నిర్మాణ పనులలో ఎలక్ట్రికల్ వర్క్‌లను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. క్రిష్టా సర్కిల్ వద్ద డ్రైన్ పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. అంతకుముందు కమిషనర్ ఎన్‌జీవో కాలనీ, అక్కాయపల్లె అర్బన్ హెల్త్ సెంటర్లలో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను తనిఖీ చేశారు. శిబిరానికి వచ్చిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్య పరీక్షలు చేసి మెరుగైన వైద్యం అందించాలని వైద్య సిబ్బందికి సూచించారు. అర్బన్ హెల్త్ సెంటర్‌లో మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వై జంక్షన్ వద్ద నుండి అప్సర సర్కిల్ వరకు పలు ఆక్రమణలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. గురుకుల్ విద్యాపీఠ్ నుంచి చిన్నచౌకు పోలీస్‌స్టేషన్ వరకూ ఏర్పాటు చేస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలన్నారు. ఎస్‌బీఐ కాలనీ వద్ద నిర్మిస్తున్న వరదనీటి కాలువను త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్, టౌన్‌ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



మార్నింగ్ విజిట్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ప్రవీణ్‌చంద్

'ఆడుదాం ఆంధ్ర'లో విజేతలుగా రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కడప డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి

కడప స్పోర్ట్స్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడాపోటీల్లో కడప క్రీడాకారులు చక్కగా రాణించి రాష్ట్రస్థాయిలో విజేతలుగా రావాలని కడప నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ రమణారెడ్డి ఆకాంక్షించారు. బుధవారం కడప నగర పరిధిలోని కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహిస్తున్న గ్రామ/వార్డు సచివాలయస్థాయి క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారుల్లోని ప్రతిభను వెలుగులోకి తీసేందుకు 'ఆడుదాం ఆంధ్ర' చక్కటి వేదిక అన్నారు. కార్యక్రమంలో ఫిజికల్ డైరెక్టర్ నిత్యప్రభాకర్, డీఎస్ కోచ్ సుదర్శన్ సిద్ధిఖ్, సచివాలయ సిబ్బంది, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఖైదీల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి



కడప కేంద్రకారాగారంలో ఖైదీలతో మాట్లాడుతున్న జడ్జి బాబా ఫకృద్దీన్

కడప అర్బన్: ఖైదీల ఆరోగ్య విషయాలపట్ల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, జడ్జి ఎస్. బాబా ఫకృద్దీన్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికారసంస్థ ఆధ్వర్యంలో బుధవారం కడప నగర శివార్లలోని కడప కేంద్ర కారాగారం, ప్రత్యేక మహిళా కారాగారంలో జడ్జి తమ సిబ్బందితో కలిసి పర్యటించారు. లీగల్ ఎయిడ్ క్లినిక్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఉచిత న్యాయసహాయం, న్యాయ సహాయం రక్షణ సలహా వ్యవస్థ, పారా లీగల్ వాలంటీర్‌లు, లీగల్ ఎయిడ్ క్లినిక్‌లు, వాటి విధి విధానాలు తెలియజేశారు. మానసిక వ్యాధి గ్రస్తులైన ఖైదీల ఆరోగ్య విషయాల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా ఎదగాలి

కడప ఎడ్యుకేషన్: ప్రతి విద్యార్థి కష్టపడి చదివి ఉత్తమ విద్యార్థులుగా గుర్తింపు తెచ్చుకోవాలని కడప తహసీల్దారు శివరామిరెడ్డి పేర్కొన్నారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్తు(ఏబీవీపీ) ఆధ్వర్యంలో ఉత్తమ లక్షణాలు, కష్టపడి చదువుకునే విద్యార్థులను ప్రోత్సహించే కార్యక్రమంలో భాగంగా బుధవారం కడప ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వేమన ప్రతిభా పురస్కార్ ఉత్తమ విద్యార్థి అభినందన సభ నిర్వహించారు. ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కోడూరు మల్లికార్జున మాట్లాడుతూ ఏబీవీపీ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది ఉత్తమ విద్యార్థి అభినంద సభను నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం తహసీల్దార్ చేతుల మీదుగా ఉత్తమ విద్యార్థులకు అవార్డులను ప్రదానం చేశారు.

అక్షింతలు పంపిణీ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం 9వ డివిజన్ లో బీజేవైఎం రాష్ట్ర నాయకులు బత్తల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం అయోధ్య శ్రీరాముల వారి అక్షింతలు గడప గడప పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొమ్మన విజయ్, బీజేపీ జిల్లా కోశాధికారి మునగా సతీష్, బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సురేంద్ర పాల్గొన్నారు.

ఏ ఒక్కరి నుంచి ఫిర్యాదు అందకూడదు

ప్రొద్దుటూరు : బియ్యం అందలేదని ఏ ఒక్కరి నుంచి తమకు ఫిర్యాదు అందినా చర్యలు తీసుకుంటామని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి చాముండేశ్వరి పేర్కొన్నారు. డీఎస్‌ఓ బుధవారం ప్రొద్దుటూరు మండలంలోని అమృతానగర్, డీసీఎస్ఆర్ కాలనీ, మోడంపల్లె, జిన్నారోడ్డు ప్రాంతాల్లో రేషన్ పంపిణీ చేస్తున్న ఐదు వాహనాల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎండీయూలు సక్రమంగా రేషన్ పంపిణీ చేస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే సరుకులు అందించాలని సూచించారు. కార్యక్రమంలో వీఆర్‌ఓలు వెంకటకృష్ణ, నాగయ్య, ఎఫ్ఐ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాలభైరవా.. నమోస్తుతే..

– నేడు కాలభైరవ స్వామి ఆలయ వార్షికోత్సవం

కడప కల్చరల్ : కాలభైరవా.. నమోస్తుతే .. అంటూ ఆ ఆలయంలో భక్తులు విశేష పూజలు చేస్తుంటారు.. ఏటా ఈ ఆలయంలో వార్షికోత్సవాలు వైభవంగా నిర్వహిస్తారు. గురువారం ఈ ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కడప నగరం వైఎస్సార్ సర్కిల్ బైపాస్‌రోడ్డు వద్ద రెండు కిలోమీటర్ల దూరంలో మగ్దూమ్ సాహెబ్ కొట్టాల గ్రామం ఉంది. కడప నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మేరువ బాలాజీరావు ఓసారి మిత్రులతో కలిసి ఆ గ్రామ వాసులకు అన్నదానం చేసే కార్యక్రమంలో పాల్గొన్నారు. అక్కడి ప్రజల పరిస్థితి దయనీయంగా ఉండడం గమనించారు. 2014 నుంచి తన సంస్థ 'బాసట' ఆధ్వర్యంలో దాతలను సమీకరించి ఆ గ్రామంలో ప్రతి నెలా రెండు, మూడు సహాయ కార్యక్రమాలు చేపడుతున్నారు. ఆ క్రమంలో

ఆ గ్రామంలోని మట్టి దిబ్బలను తొలగించేందుకు ప్రయత్నించగా.... అందులో ఓచోట దేవాలయం ఉందని ఆ గ్రామానికి చెందిన ఓ మహిళ తెలిపింది. దీంతో అక్కడి మట్టిని తవ్వగా శిథిలమైన దేవాలయం, ముక్కలై ఉన్న కాలభైరవ స్వామి మూల విగ్రహం కనిపించాయి. ఒక శాసనం కూడా బయల్పడింది. దాని ఆధారంగా ఈ ఆలయం పురాతనమైనదని భావించారు. దాతల సహకారంతో ఆలయాన్ని పునరుద్ధరించారు. 2015లో కాలభైరవస్వామి నూతన విగ్రహాన్ని శాస్త్రోక్తంగా ప్రతిష్ఠించారు. ప్రస్తుతం ఈ ఆలయంలో నిత్య పూజలేగాక ప్రతిమాసం ఒకరోజు స్వామికి విశేష పూజలు క్రమం తప్పక నిర్వహిస్తున్నారు.

చరిత్రలో.....

ఈ ఆలయం వద్ద బయటపడిన శాసనాన్ని గమనించి కడప కైఫీయత్తుల పరిష్కర్త విద్వాన్ కట్టా నరసింహులు ఈ ఆలయం మూడు వందల సంవత్సరాల కాలం నాటిదై ఉంటుందని తెలిపారు. కైఫీయత్తుల్లో 'కడప షహర్ వృత్తాంతం' విభాగంలో అనుబంధంగా దీనికి సంబంధించిన వివరాలను ఆధారంగా చూపారు. అందులో అప్పట్లో ఆ గ్రామం, ఆ ఆలయం సిద్ధవటం పాలనలో ఉండేవని, ఈ గ్రామానికి గల చరిత్ర, పొలిమేరల్లో గల గ్రామాల పేర్లను పరిశీలించారు. ఆ గ్రామంలో అప్పట్లో 'ఇష్టకామ్యార్థ శ్రీ కాల భైరవస్వామి' ఆలయం ఉండేదని ఆధారాల సహితంగా స్పష్టం చేశారు.

కుష్మాండ హారతి ప్రత్యేకం..

– ఆలయ పూజల్లో గుమ్మడికాయల దీపాలను వెలిగించడం ఇక్కడి ప్రత్యేకత. గురువారం ఆలయ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇందులో భాగంగా ఉదయం 6 గంటలకు ప్రత్యేక అభిషేకం, 9 గంటలకు హోమం, పూజలు, మధ్యాహ్నం 12 గంటలకు కుష్మాండ హారతి, 12.30 గంటలకు అన్నదానం నిర్వహిస్తారు.



ప్రత్యేక పూజలతో కళకళలాడుతున్న కాలభైరవ స్వామి ఆలయం